సాక్షి
ప్రకాశం
సోమవారం । 22 । మే । 2023



నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- 8లో..



ఉపాధ్యాయుడి నివాసం లూటీ

ఒంగోలు నగరంలో ఓ ఉపాధ్యాయుడి నివాసాన్ని దొంగలు కొల్లగొట్టారు. రూ.23.50 లక్షల సొత్తు అపహరించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
41 /28

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

డిగ్రీ పాసైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశం

ఒంగోలు అర్బన్: డిగ్రీలో బీఎస్సీ, బీకాం పాస్ అయిన విద్యార్థులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో డిప్యూటీ డ్యూటీ మేనేజర్ ఉద్యోగాలు కల్పించేందుకు సంబంధిత కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ సహకారంతో నగరంలోని బొల్లినేని మెడ్ స్కిల్ కేంద్రంలో మూడు నెలల పాటు ఈ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. 20 నుంచి 30 ఏళ్ల వయసున్న యువతీ యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం, బీమా సదుపాయం కల్పిస్తారన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి పారా మెడికల్ డిగ్రీ కోర్సులు, నర్సింగ్, ఎంఎల్‌టీ, బీపీటీతో పాటు 12 పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ఒంగోలు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, 80 శాతానికిపైగా మార్కులు సాధించిన విశ్వ బ్రాహ్మణ విద్యార్థినీ విద్యార్థులకు జూన్ 4న అభినందన సభ, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పాతకమూరి బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కళ్యాణ మండపం కమిటీ నిర్ణయం ప్రకారం ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5116, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.3116, తృతీయస్థానం పొందిన వారికి రూ.2116 అందజేస్తారన్నారు. అంతే కాకుండా 80 శాతానికిపైగా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థినీ విద్యార్థికి తెలుగు-ఇంగ్లిష్ డిక్షనరీతోపాటు విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపం కమిటీ నుంచి మెమెంటో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు రాసి, 80 శాతంకుపైగా మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాలు మహిళలు, చిన్నారుల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నాయి. కేంద్రాలకు వచ్చే వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని నిరంతరం పరిశీలిస్తూ తగిన సూచనలు ఇస్తుంటారు. అయితే ఇకపై అంగన్‌వాడీ కేంద్రాలకు దూరంగా ఉండి అక్కడికి రాలేకపోయే వారి కోసం కూడా పౌష్టికాహార కిట్లు ఇంటికే పంపనున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



జిల్లాలో గర్భిణులు	బాలింతలు
12,053	11,703

- వైఎస్ఆర్ సంపూర్ణ పోషణతో మహిళల ఆరోగ్యానికి రక్షణ
- 13 ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో అమలు
- జూన్ 1 నుంచి ఇంటికే పౌష్టికాహారం అందజేత



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు, ఎత్తు చూస్తున్న సిబ్బంది

మార్కాపురం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం, జగనన్న కిట్ల ద్వారా మహిళల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోంది. జిల్లాలో మార్కాపురం, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, బేస్తవారిపేట, గిద్దలూరు, కనిగిరి, పొదిలి, వెలిగండ్ల, దర్శి, ఒంగోలు, మద్దిపాడు, టంగుటూరు, కొండపి మొత్తం 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 2,903 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న 12,053 మంది గర్భిణులకు, 11,703 మంది బాలింతలకు ఈ పథకం ద్వారా ప్రతి రోజు సంపూర్ణ పోషకాహారం అందిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా తల్లీబిడ్డ బాగుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఉంటుందన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. వైఎస్ఆర్ కిట్‌లో భాగంగా కిలో రాగిపిండి, కిలో అటుకులు, పావుకిలో బెల్లం, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల చిక్కీలు, పాలు, గుడ్లను ఉండే కిట్‌ను అందిస్తారు. ఇప్పటి వరకు కేంద్రానికి వస్తే ఆకుకూర పప్పు, పాలు, కోడిగుడ్డు పెడుతున్నారు. జూన్ 1 నుంచి ప్రతి గర్భిణి, బాలింతలకు 125 గ్రాముల బియ్యం, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల ఆయిల్ ప్రకారం, 25 రోజులకు సరిపడే వస్తువులను ఇంటికి వచ్చి ఇవ్వనున్నారు.

కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండడంతో గర్భిణులు, బాలింతలు మధ్యాహ్న సమయంలో కేంద్రాలకు రాలేకపోతున్నారన్న సమాచారం అధికారులకు తెలియడంతో వచ్చే నెల 1 నుంచి పౌష్టికాహారాన్ని ఇంటి వద్దకే పంపనున్నారు. ఈ నిర్ణయం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళల్లో రక్తహీనత తగ్గించటం, వ్యాధి నిరోధక శక్తి సహజంగా పెంచేందుకు వైఎస్ఆర్ సంపూర్ణ పథకం ఉపయోగపడుతుంది. ప్రతి నెలా చిన్నారులకు హెచ్‌బీ (రక్త శాతం తెలుసుకునే పరీక్ష) టెస్టు చేసి రక్తహీనత ఉన్న వారిని గుర్తిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు హోం విజిట్ ద్వారా తల్లీపిల్లల ఆరోగ్యం తెలుసుకుని హెల్త్ వర్కర్ ద్వారా ఐరన్, క్యాల్షియం టాబ్లెట్‌లను అందించే ఏర్పాటు చేస్తున్నారు.



భోజనం చేస్తున్న మహిళలు

పటిష్టంగా అమలు చేస్తున్నాం

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై దృష్టి సారించాం. ముఖ్యంగా రక్తహీనతను నివారిస్తున్నాం. వచ్చే నెల 1 నుంచి పౌష్టికాహారాన్ని ఇళ్లకు అందిస్తాం.

– ధనలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్, ఒంగోలు



మంచి ఆహారం అందుతుంది

అంగన్‌వాడీ కేంద్రంలో మాకు ప్రతి రోజు మంచి పౌష్టికాహారం అందజేస్తున్నారు. కేంద్రానికి పంపించే పిల్లలకు కూడా మంచి భోజనం పెడుతున్నారు. పిల్లల బరువు చూస్తూ తక్కువ బరువుంటే అవసరమైన సూచనలు ఇస్తూ పౌష్టికాహారం అందిస్తున్నారు.

– సుబ్బులక్ష్మి, పీఎస్ కాలనీ

హైస్కూలు ప్లస్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని హైస్కూలు ప్లస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జక్టులను బోధించేందుకు ఆసక్తిగల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు.

సబ్జెక్టు వారీగా ఖాళీగా ఉన్న పాఠశాలల వివరాలు:

ఆంగ్లం: అద్దంకి మండలం తిమ్మాయపాలెం జెడ్పీహెచ్ఎస్, సీఎస్‌పురం మండలం శీలంవారి పల్లి జెడ్పీహెచ్ఎస్, సింగరాయకొండ మండలం పాకల జెడ్పీహెచ్ఎస్

గణితం: ఇంకొల్లు జెడ్పీహెచ్ఎస్

కెమిస్ట్రీ: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి జెడ్పీహెచ్ఎస్, గిద్దలూరు మండలం గిద్దలూరు జెడ్పీహెచ్ఎస్, జె.పంగులూరు మండలం బూదవాడ జెడ్పీహెచ్ఎస్

బోటనీ: అద్దంకి మండలం తిమ్మాయపాలెం జెడ్పీహెచ్ఎస్, చీమకుర్తి మండలం దేవరపాలెం జెడ్పీహెచ్ఎస్, జె.పంగులూరు మండలం బూదవాడ జెడ్పీహెచ్ఎస్, కొండపి మండలం ఉప్పలపాడు జెడ్పీహెచ్ఎస్, టంగుటూరు మండలం కొణిజేడు జెడ్పీహెచ్ఎస్

జువాలజీ: సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అద్దంకి మండలం తిమ్మాయపాలెం జెడ్పీహెచ్ఎస్, సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లి జెడ్పీహెచ్ఎస్, చీమకుర్తి మండలం దేవరంపాలెం జెడ్పీహెచ్ఎస్, ఇంకొల్లు జెడ్పీహెచ్ఎస్, జె.పంగులూరు మండలం బూదవాడ జెడ్పీహెచ్ఎస్, కొండపి మండలం ఉప్పలపాడు జెడ్పీహెచ్ఎస్.

కామర్స్: మార్టూరు మండలం వలపర్ల జెడ్పీహెచ్ఎస్, సింగరాయకొండ మండలం పాకల జెడ్పీహెచ్ఎస్.

40 రోజుల పాటు ఉచిత దంత వైద్య సేవలు

ఒంగోలు అర్బన్: నేటి నుంచి 40 రోజుల పాటు స్థానిక గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత దంత వైద్య సేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు ప్రముఖ మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు చాపల వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో దంత ఆరోగ్య సంరక్షణపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు హాస్పిటల్‌లో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ దంత వైద్యులు డాక్టర్ నందలూరు సరయు నేతృత్వంలో ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉచితంగా ఓపీతో పాటు అవసరమైన పరీక్షలు, ఆపరేషన్లు రాయితీపై చేస్తారన్నారు.

పులి సంచారంపై కలవరం

- నాగులవరం సమీపంలో కంభం చెరువులో నీళ్లు తాగి వెళ్లినట్లు గుర్తింపు



జనవరి నెలలో లక్ష్మీపురం సమీపంలో సంచరిస్తూ ట్రాప్ కెమెరాలో చిక్కిన పులి (ఫైల్)



పెద్దపులి పాదముద్రను పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది (ఫైల్)



అధికారులు గుర్తించిన పెద్దపులి పాదముద్ర

అర్ధవీడు (కంభం): అర్ధవీడు మండలంలో పెద్దపులి మరో మారు సంచరిస్తుందన్న వార్తలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గత ఈ ఏడాది జనవరి నెలలో అర్ధవీడు మండలంలోని మాగుటూరు, లక్ష్మీపురం, కాకర్ల పెద్దపులి సంచరిస్తూ ఓ ఎద్దును దాడి చేసి చంపడం, మరో ఎద్దుపై దాడి చేసిన సంఘటనలు జరిగాయి. పులికోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసిన ఫారెస్టు అధికారులు పులి కదలికలను గుర్తించారు. కొన్ని రోజులకు పెద్దపులి అడవుల్లోకి వెళ్లిపోయిందని ఫారెస్టు అధికారులు చెప్పడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం నాగులవరం సమీపంలో కంభం చెరువు వద్దకు పెద్దపులి వచ్చి మంచినీళ్లు తాగి వెళ్లడాన్ని గమనించిన కొందరు స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. కంభం చెరువు పరిసరాలను పరిశీలించిన ఫారెస్టు అధికారులు పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. గొట్టిపడి నుంచి మాగుటూరు, లక్ష్మీపురం మీదుగా నాగులవరం వైపు ఉన్న కంభం చెరువులో నీళ్లు తాగి మళ్లీ అదే మార్గంలో వెళ్లిపోయినట్లుగా ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. పులిసంచారం లేదని కొంతకాలంగా ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలకు తిరిగి పెద్దపులి సంచరిస్తుందని తెలియడంతో ఉలిక్కిపడుతున్నారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు.. పులి తిరిగి వెళ్లిపోయిందని ఫారెస్టు అధికారులు చెబుతున్నా ప్రజల్లో ఆందోళన తగ్గడం లేదు. పులి ప్రజలపై, పశువులపై దాడి చేయకుండా ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

రాష్ట్రాన్ని కబళించేందుకు రాబందులొస్తున్నాయి

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్రాన్ని కబళించటానికి పచ్చ రాబందులు వస్తున్నాయని, వాటి వలన పేదలకు నష్టం వాటిల్లుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం ఆ రాబందులకు ఏ మాత్రం ఇష్టంలేదని, తాము మరింత అభివృద్ధి చేస్తామని చెప్పుకుంటూ తిరుగుతున్నాయని టీడీపీ, జనసేన నాయకులతోపాటు వారికి వత్తాసు పలుకుతున్న పచ్చ మీడియాను ఉద్దేశించి అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రపుశాల పంచాయతీ గంగుపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి గడపకు వెళ్లి గత నాలుగేళ్లుగా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌లతోపాటు బాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ రాష్ట్రంపై పడ్డారని, జగనన్నపై అనవసరపు ఆరోపణలు చేసుకుంటూ తిరుగుతున్నారని అన్నారు. వీరికి తోడుగా పచ్చ పత్రికలు, మీడియా ప్రభుత్వంపై అబద్ధపు రాతలు రాసుకుంటూ ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. 2014లో వచ్చిన ఎన్నికల్లో అలివికాని వాగ్దానాలు చేసి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి వచ్చిన తరువాత పచ్చ నేతలు తాము చేసిన వాగ్దానాలను విస్మరించి రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆయన విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన వాగ్దానాలు ఆయన అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే 90 శాతం అమలు చేశారని చెప్పారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా నవరత్నాల పథకాలను ఎటువంటి అవినీతికి తావివ్వకుండా అమలు చేస్తుంటే పచ్చనేతలకు మింగుడు పడటంలేదని, ఎన్నికలు సమీపిస్తుండటంతో వాటిని తాము అమలు చేస్తామని సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బాబు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఏ పార్టీతో పొత్తుపెట్టుకోవాలో అర్థంకాకుండా ఉన్నాడని, తమ పోరాటం అంతా జగన్‌ను గద్దెదింపటానికే అని అంటున్నాడని విమర్శించారు.

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయండి

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుర్రపుశాల పంచాయతీ కార్యదర్శి ఎలక శ్రీనును సస్పెండ్ చేయాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌ను మంత్రి ఆదేశించారు. అధికారిక కార్యక్రమమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపట్ల కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వలంటీర్లను సమాయత్తం చేయకుండా, ప్రభుత్వ బుక్‌లెట్‌లను ముందుగానే గ్రామంలో పంపిణీ చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. అంతే కాకుండా 14 మంది వలంటీర్లు ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే కార్యక్రమానికి హాజరు కావడంపై ఆయన మండిపడ్డారు. కార్యక్రమానికి హాజరు కాని వలంటీర్లను తొలగించి కొత్త వారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని, ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడుకు మెమో ఇవ్వాలని ఆయన సబ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సర్పంచ్‌లు వాడాల పద్మ వీరయ్య, డి.సుబ్బారెడ్డి, డీటీ విజయభాస్కర్, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు, ఏఈలు శ్రీకాంత్, అంజిరెడ్డి, అల్లూరయ్య, ఏపీవో నాగేశ్వరరావు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ కోటా నాయక్ పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ, ఆరోగ్య పరిరక్షణ



సమ్మర్ క్యాంప్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ, విద్యార్థులు



శిక్షణ ఇస్తున్న కోచ్ కరీముల్లా



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టెప్ చీఫ్‌కోచ్ రాజరాజేశ్వరి

- స్టెప్ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి
- సాక్షి ఆధ్వర్యంలో ఉచిత తైక్వాండో శిక్షణ శిబిరం

ఒంగోలు: తైక్వాండో కేవలం ఆత్మరక్షణకు మాత్రమే కాదని, ఆరోగ్య పరిరక్షణకు, శారీరక సామర్థ్యానికి దోహదపడుతుందని స్టెప్ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి అన్నారు. సాక్షి ఆధ్వర్యంలో ఉచిత తైక్వాండో శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. స్థానిక సీవీఎస్ రీడింగ్ రూము అండ్ క్లబ్ ఆవరణలోని వేదికపై తైక్వాండో జాతీయ ఛాంపియన్, కోచ్ షేక్ కరిముల్లా నేతృత్వంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సాక్షి మీడియా ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గుంటి రాజరాజేశ్వరి మాట్లాడుతూ సాధారణంగా ప్రభుత్వం, క్రీడా సంఘాలు చేపట్టే కార్యక్రమాన్ని సాక్షి మీడియా నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఇటీవల సాక్షి క్రికెట్ ప్రీమియర్‌లీగ్ పోటీలను కూడా స్థానిక మినీ స్టేడియంలో అద్భుతంగా నిర్వహించారన్నారు. తాజాగా తైక్వాండో శిక్షణ, పోటీలు నిర్వహించేందుకు వారు ముందుకు రావడాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలన్నారు.

తైక్వాండో జాతీయ చాంపియన్, కోచ్ షేక్ కరిముల్లా మాట్లాడుతూ స్టెప్ చీఫ్ కోచ్ గుంటి రాజరాజేశ్వరి కూడా ఒక అంతర్జాతీయ క్రీడాకారిణి అని, పవర్‌లిఫ్టింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన విషయాన్ని క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శిక్షణకు వచ్చిన వారు కూడా దీని ఉపయోగాలను సహచర విద్యార్థులకు వివరిస్తూ వారు కూడా శిక్షణ అవసరాన్ని గుర్తించేలా చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ సహాయకులు ఒకటో డాన్ ప్రశాంత్, రెండో డాన్ షేక్ ఆరిఫ్‌లు మాట్లాడుతూ తైక్వాండో ద్వారా ఎటువంటి ఆయుధం లేకుండానే చేతులనే ఆయుధంగా మార్చి విపత్కర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడమే కాకుండా అనేకమందికి అండగా ఉండే శక్తి లభిస్తుందన్నారు. ఈ క్రీడల్లో బాలలతోపాటు బాలికలు కూడా ఎక్కువగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ప్రధానంగా విద్యార్థులు ఈ అభ్యసనం ద్వారా ఏకాగ్రతను కూడా అధికంగా పొందగలుగుతారని, సమాజాన్ని చైతన్యం చేసేందుకు ముందుకు వచ్చిన సాక్షి మీడియాకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.



తైక్వాండో శిక్షణలో చిన్నారి

క్లుప్తంగా

వల్లూరమ్మకు కేజీ వెండి వస్తువుల బహూకరణ



అమ్మవారికి వెండి వస్తువులు బహూకరిస్తున్న మధులత

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి ఓ దాత ఆదివారం కేజీ వెండి వస్తువులు బహూకరించారు. జరుగుమల్లి గ్రామానికి చెందిన భక్తురాలు మధులత అమ్మవారి ఉత్సవమూర్తులకు వెండి కిరీటాలు, త్రిశూలం, తీర్థపు గిన్నెలు బహూకరించారని ఆలయ ఈఓ రమేష్ వివరించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్టు

- రూ.7.80 లక్షల విలువైన 13 సవర్ల బంగారు ఆభరణాలు రికవరీ

దర్శి టౌన్: బస్సుల్లో చోరీకి పాల్పడుతున్న మహిళను దర్శి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి రూ.7.80 లక్షల విలువైన 13 సవర్ల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం..ఏప్రిల్ ఆరవ తేదీన అద్దంకి నుంచి దర్శి వస్తున్న పాణేం ముంతాజ్ బ్యాగ్ చోరీకి గురైంది. అందులో 12 సవర్ల బంగారం ఉన్నట్లు బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై రామక్రిష్ణ డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ రామకోటయ్య పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో దర్యాప్తు మొదలు పెట్టారు. దీంతో దర్శి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న చీరాల ఆదినారాయణపురానికి చెందిన సాతుపాటి కుమారిని అరెస్టు చేసి విచారించారు. ఆమె వద్ద నుంచి 13 సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన సీఐ రామకోటయ్య, ఎస్సై రామక్రిష్ణ, కానిస్టేబుళ్లు విజయ్, శేషగిరిలను డీఎస్పీ అశోక్‌వర్ధన్ అభినందించారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి కావడం వల్ల రోజుకు 9 గంటల పాటు వ్యవసాయానికి అందిస్తున్న విద్యుత్‌లో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని గంగుపల్లిలో రూ. 2 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతు సీఎం ఇచ్చిన హామీకి కట్టుబడి రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనకంజ వేయడం లేదన్నారు. దీని వల్ల వ్యవసాయంతో పాటు ఉత్పత్తి రంగాలకు, నీటి సరఫరాకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు బాధ్యత పెరుగుతుందని, అవగాహన కలుగుతుందన్న ఉద్దేశంతో వారికి ఒక రూపాయి భారం పడకుండా మీటర్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నారన్నారు. 15 ఏళ్ల క్రితం వైఎస్సార్ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే తన తొలి సంతకం ఉచిత విద్యుత్‌పైనే పెట్టారని ఆయన జ్ఞాపకం చేశారు. దీనిపై టీడీపీ నాయకులు హేళన చేశారని, ఒకవేళ ఉచిత విద్యుత్ ఇస్తే విద్యుత్ తీగలపై బట్టలు ఆరేసుకోవచ్చని ఎగతాళి చేశారని ఆయన విమర్శించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు బడుగు, బలహీన వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందిస్తున్నారని, తక్కువ ఖర్చుతో తమ గృహాల్లో మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు.

సబ్‌స్టేషన్లు పెంచుతున్నాం..

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సబ్‌స్టేషన్లను పెంచుతున్నామన్నారు. ఎక్కువ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్న నియోజకవర్గంగా యర్రగొండపాలెం నిలిచిందని తెలిపారు. పుల్లలచెరువు మండలంలోని రంగన్నపాలెం వద్ద రూ.129 కోట్లతో 220కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం స్థల సేకరణ జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో 5 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలు కూడా బాధ్యత తీసుకొని కరెంట్‌ను ఆదా చేయాలన్నారు. అభివృద్ధిని ఆటంకం పరచటానికి గంగుపల్లిలో 9 ఏళ్ల క్రితం మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్‌పై కోర్టుకు వెళ్లారని, దీని వల్ల నిర్మాణ పనులు ఆలస్యం అయ్యాయని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసుకోవడం వలన కొంతమంది స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని, లో ఓల్టేజీ సమస్య లేకుండా పోతుందని పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా అస్తవ్యస్తంగా ఉన్న గుర్రపుశాల–గంజివారిపల్లె రోడ్డు అభివృద్ధికి సీఎండీ నిధుల నుంచి రూ 5.90 కోట్లు మంజూరయ్యాయని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ వాడాల పద్మవీరయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్) వీవీ నాగేశ్వరరావు, ఏడీ గోవిందరావు, ఏఈలు మురళీమోహన్, అల్లూరయ్య, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, ఏకుల ముసలారెడ్డి, వై.రోషిరెడ్డి, డి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి నివాసం లూటీ

- ఒంగోలు నగరంలోని మంగమూరు డొంక శివారులో ఘటన
- వారం క్రితం హైదరాబాద్ వెళ్లిన ఇంటి యజమాని
- కుమారుడి పెళ్లి షాపింగ్ ముగించుకుని శనివారం అర్ధరాత్రి ఇంటికి రాక
- చోరీ అయిన సొత్తు విలువ రూ.23.50 లక్షలు



ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

ఒంగోలు: ఒంగోలు నగర శివారులో ఓ ఉపాధ్యాయుడి నివాసాన్ని దొంగలు కొల్లగొట్టారు. పెద్ద మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలు కాజేశారు. స్థానిక మంగమూరు డొంకలోని పార్థసారథి నగర్‌లో శనివారం అర్ధరాత్రి వెలుగు చూసిన ఈ ఘటన పూర్తి వివరాలిలా ఉన్నాయి. స్థానిక సమతానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కమ్మిశెట్టి రమేష్.. మంగమూరు డొంక శివారులోని పార్థసారథి నగర్‌లో సొంత ఇల్లు నిర్మించుకుని భార్యతో కలిసి ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అమెరికాలో ఉంటుండగా, రెండో కుమారుడు సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. అమెరికా నుంచి పెద్ద కుమారుడు వస్తుండటంతో ఈ నెల 14వ తేదీన రమేష్ తన భార్యతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. అక్కడే మెహిదీపట్నం అత్తాపూర్‌లోని బంధువుల ఇంట్లో ఉన్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఒంగోలులోని ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం ధ్వంసమై ఉండటం, షెల్ఫులు, బీరువాలు సైతం తెరిచి ఉండటంతో హతాశులయ్యారు. దొంగలు పడినట్లు గ్రహించి నేరుగా తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. బీరువాలో ఉంచిన రూ.20 లక్షల నగదు, 13 సవర్ల బంగారు ఆభరణాలు(రాళ్లు పొదిగిన బంగారు గాజులు 2, నల్లపూసల బంగారు నెక్లెస్ ఒకటి), అర కేజీ వెండి వస్తువులు(ఒక ప్లేటు, చెంబు, గ్లాసు) అపహరణకు గురయ్యాయని, మొత్తం చోరీ అయిన సొత్తు విలువ 23.50 లక్షలు ఉంటుందని బాధితుడు రమేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని తాలూకా ఎస్సై అంకమ్మరావు పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు, ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

త్వరలో కుమారుడి పెళ్లి.. ఇంతలోనే ఇలా..

టీచర్ రమేష్ తన రెండో కుమారుడికి వివాహం చేయాలని ఇటీవలే నిశ్చయించారు. ఈ నెల 25న పెళ్లి ముహూర్తం పెట్టుకోవాలని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే బంగారం కొనేందుకు, ఇతర అవసరాల కోసమని రూ.20 లక్షలు తెచ్చి ఇంట్లో ఉంచారు. అమెరికా నుంచి వస్తున్న పెద్ద కుమారుడిని ఎయిర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకుని ఒక్కరోజులోనే తిరిగి రావాలని హైదరాబాద్ వెళ్లిన రమేష్ దంపతులు.. షాపింగ్, ఇతర పనుల కోసం వారం రోజులపాటు అక్కడే ఉండిపోయారు. తిరిగి రావడం ఆలస్యమవుతుండటంతో పెంపుడు శునకాన్ని తీసుకెళ్లాలని బంధువులకు చెప్పారు. వారం రోజులుగా ఎవరూ లేని ఆ ఇంటిని బంధువులుగానీ, సమీపంలోనివారుగాని పరిశీలించిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్)ను వినియోగించుకుని ఉన్నా చోరీ జరిగి ఉండేది కాదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే రెక్కీ నిర్వహించి మరీ చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్న పోలీసులు.. సమీపంలో సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించి, నిందితుల ఆచూకీ కనుగొనే పనిలో నిమగ్నమయ్యారు.



ధ్వంసమైన ప్రధాన ద్వారాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సైబర్ నేరాలకు చెక్ పెడదాం

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు: ఆధార్ కార్డుతో సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఆధార్ వివరాలను తెలియని వ్యక్తులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని, యుఐడీఏ వెబ్‌సైట్లో ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేసుకుంటే వ్యక్తిగత సమాచారం భద్రంగా ఉంటుందన్నారు. డిజిటల్ యుగం నడుస్తున్న తరుణంలో సైబర్ నేరగాళ్లు మీ ప్రమేయం లేకుండానే బ్యాంకు ఖాతాలకు లింక్ చేసిన మీ ఆధార్ వివరాలను వివిధ మార్గాల ద్వారా సేకరించి మీ వేలిముద్రలను క్లోనింగ్ ప్రక్రియ ద్వారా వినియోగించి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును కాజేస్తుంటారన్నారు. ఆధార్ బయోమెట్రిక్‌లను లాక్ చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఆధార్ కార్డు వివరాలు, బయోమెట్రిక్స్ సైబర్ నేరస్తులకు చిక్కకుండా ఉండేందుకు మొబైల్ నెంబర్‌ను ఆధార్‌తో లింకు చేసుకోవాలన్నారు. దీనివల్ల ఆధార్ వెరిఫికేషన్ కోసం ఆధార్‌తో లింకు చేసిన మొబైల్‌కు ఓటిపి వస్తుందన్నారు. ఓటీపీ లేకుండా ఆధార్ వెరిఫై చేయడం జరగదని, తద్వారా ఆధార్ దుర్వినియోగాన్ని నివారించుకోవచ్చన్నారు. ఎవరికైనా ఆధార్ కార్డు ఫొటో కాపీని ఇవ్వాల్సిన అవసరం వస్తే మాస్క్ చేసిన ఆధార్ కాపీని ఇవ్వాలని, ఇందులో ఆధార్ పూర్తి నంబర్ ఉండదన్నారు. చివరి నాలుగు అంకెలు మాత్రమే కనిపిస్తాయన్నారు. మాస్క్ చేసిన ఆధార్ కాపీని హెచ్‌టీటీపీఎస్://యుఐడీఏఐ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. యూఐడీఏఐ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://రెసిడెంట్.యుఐడీఏఐ.జీఓవి.ఇన్/బయో-లాక్ లేదా ఎంఆధార్ యాప్ ద్వారా మీ ఆధార్ బయోమెట్రిక్‌లను లాక్ చేసి మీ వ్యక్తిగత సమాచారానిన సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. అనుమానంగా ఉన్న వెబ్‌సైట్‌లో ఎట్టి పరిస్థితుల్లో మీరు మీ ఆధార్‌కార్డును అప్‌లోడ్ చేయవద్దని, డేటా వినియోగానికి సంబంధించిన సంస్థలపై అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. లేదా హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



వృద్ధుని మృతదేహం

మార్కాపురం: మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం వృద్ధుని మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రామచంద్రాపురం గ్రామం నుంచి బడేఖాన్‌పేట వెళ్లే దారిలో వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. సుమారు 4, 5 రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. మృతుని శరీరంపై ఎలాంటి దుస్తులు లేవు. సంఘటన స్థలాన్ని రూరల్ పోలీసులు సందర్శించి, వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బు కోసమే నా బిడ్డను చంపాడు

- అల్లుడితోపాటు అతని తల్లిదండ్రులనూ శిక్షించాలి
- కావాలనే తన కూతురిపై అపనిందలు వేస్తున్నాడు
- రూ.70 లక్షల నగదు, 30 సవర్ల బంగారం, 8 ఎకరాలు పొలం కట్నంగా ఇచ్చా
- ఈనెల 6న మళ్లీ రూ.25 లక్షలు ఇచ్చా
- అయినా కనికరం చూపలేదయ్యా..
- కన్నీటి పర్యంతమైన రాధ తండ్రి సుధాకర్‌రెడ్డి



సుధాకర్‌రెడ్డి

కనిగిరి రూరల్: కేవలం డబ్బు కోసమే తన కూతురు రాధను అల్లుడు మోహన్‌రెడ్డి అతి దారుణంగా కొట్టి కారుతో గుద్ది, చిత్రహింసలు పెట్టి చంపాడని మృతురాలి తండ్రి సుధాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాధ కుటుంబ సభ్యులు 'సాక్షి'తో మాట్లాడారు. డబ్బు కోసం చంపి తప్పించుకునేందుకే తన కూతురిపై అపనిందలు వేస్తున్నాడని తీవ్రంగా మండిపడ్డారు. అల్లుడు మోహన్‌రెడ్డికి సుమారు రూ.70 లక్షల నగదు, 30 సవర్ల బంగారం, 8 ఎకరాల పొలం ఇచ్చానని, ఎప్పుడు అడిగితే అప్పుడు కావాల్సినంత డబ్బులు అందజేసినట్లు సుధాకర్‌రెడ్డి చెప్పారు. తన తమ్ముడి దగ్గర రాధ రూ.25 లక్షలు తీసుకుని ఈనెల 6వ తేదీన మోహన్‌రెడ్డికి ఇచ్చినట్లు వెల్లడించారు. ఇంత డబ్బు తీసుకుని కూడా కనికరం లేకుండా తన కూతుర్ని పొట్టనపెట్టుకున్నాడని వాపోయారు. తన కూతురి పేరుతో రూ.కోటిన్నర ఇన్సూరెన్స్ చేసినట్లు తెలిసిందని, ఆ డబ్బు కోసమే పక్కాగా ప్లాన్ వేసి రాధను చంపాడని కన్నీరు మున్నీరుగా విలపించారు. జాతర రోజునే చంపేందుకు ప్లాన్ చేశాడని తెలిసిందన్నారు. తన కూతుర్ని అత్తామామలు కూడా తరచూ ఇబ్బంది పెట్టే వారన్నారు. తన కూతురిని అంతమొందించడంలో అల్లుడు మోహన్‌రెడ్డితో పాటు అతని తల్లిదండ్రుల పాత్ర ఉందని ఆరోపించారు. వారందరినీ కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

మృత్యు 'కేళి'

- విద్యుదాఘాతంతో బాలుడు మృతి
- స్నేహితుడి ఇంటిపై ఆడుకుంటుండగా ఘటన



మృతి చెందిన ధీరజ్

కనిగిరి రూరల్: స్నేహితులతో సరదాగా ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతి చెందాడు. ఈ విషాద సంఘటన ఆదివారం రాత్రి కనిగిరిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని జవహర్‌లాల్ వీధికి చెందిన కొలిపాకుల ధనుంజయ్ చిన్న కుమారుడు ధీరజ్(12) తోటి స్నేహితులు ఆరుగురితో కలిసి క్రికెట్ ఆడుకునేందుకు సాయినగర్ శివారు ప్రాంతానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో బొగ్గులగొందిలోని స్నేహితుడి నివాసానికి వెళ్లాడు. అక్కడ ఇంటిపై పైప్‌తో నీళ్లు చల్లుకుంటూ సరదాగా ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో మిద్దెపై ఉన్న లైట్ రాడ్‌పై నీళ్లు పడ్డాయి. తడిగా ఉన్న ఆ లైట్‌రాడ్‌ను ధీరజ్ పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఆడుకుని వస్తానని చెప్పి బయటకు వెళ్లిన కుమారుడు విగత జీవిగా ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు ధనుంజయ్, శ్వేత కన్నీటిపర్యంతమయ్యారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో షార్ట్ సర్క్యూట్

- దగ్ధమైన మూడు ఏటీఎం మిషన్లు



మార్కాపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఏటీఎం కాంపౌండ్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. ప్రమాదంలో మూడు ఏటీఎం మిషన్లు కాలిపోయాయి. శనివారమే ఒక్కో ఏటీఎంలో రూ.20 లక్షల నగదు పెట్టినట్లు తెలిసింది. ఆదివారం రాత్రి 9:3 గంటల సమయంలో ఏటీఎం నుంచి మంటలు రావడంతో స్థానికులు గుర్తించి పక్కనే ఉన్న అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఏటీఎంలకు సమీపంలో దుకాణాలు ఉండటంతో, మంటలు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్, ఆఫీసర్ ఓబుల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఎంత మేర నష్టం వాటిల్లింది సోమవారం తెలుస్తుందని చెప్పారు. బస్టాండ్ ఎదురు కావడంతో అగ్నిప్రమాదం జరగడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ భీమానాయక్ సందర్శించారు.

24 నుంచి ఇంటర్మీడియెట్

అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు

- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 72 కేంద్రాల ఏర్పాటు
- ఉదయం జూనియర్, సాయంత్రం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదు
- పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషిద్ధం
- విధి నిర్వహణలో ఉండేవారికి ఐడీ కార్డు తప్పనిసరి
- అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

ఒంగోలు: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం జూనియర్ ఇంటర్, సాయంత్రం సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 72 కేంద్రాలను ఎంపిక చేశారు. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 21,219 మంది, సీనియర్ ఇంటర్ పరీక్షలకు 11,012 మంది వెరసి మొత్తం 32,231 మంది హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం 72 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 72 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 628 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కంభం, పెదదోర్నాల, అర్ధవీడు, వై.పాలెంలోని పరీక్షా కేంద్రాలను అత్యంత సున్నితమైన కేంద్రాలుగా గుర్తించి ప్రత్యేక దృష్టిసారించారు. కాపీయింగ్ నిరోధానికి 4 ఫ్లయింగ్ స్క్వాడ్, 4 సిటింగ్ స్క్వాడ్ బృందాలతోపాటు ఆర్ఐవో, డీఈసీ సభ్యులు, హైపవర్ కమిటీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్, రాష్ట్ర స్థాయి ఇంటర్ బోర్డు అధికారులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. ట్యూషన్ ఫీజు చెల్లించలేదనే నెపంతో హాల్ టికెట్లు నిరాకరించే ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల గుర్తింపు రద్దు చేస్తామని ఆర్ఐఓ సైమన్ విక్టర్ హెచ్చరించారు.

నిఘా నీడలో పరీక్షలు

పరీక్ష కేంద్రాల్లోని అన్ని గదులకు, ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద, ప్రశ్నపత్రాల బండిల్స్ ఓపెన్ చేసే గది, జవాబు పత్రాలు ప్యాక్ చేసే గది.. ఇలా ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ఒంగోలు ఆర్ఐఓ కార్యాలయం, విజయవాడలోని ఇంటర్ బోర్డు ప్రధాన కార్యాలయానికి సీసీ కెమెరాలను అనుసంధానించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆలస్యంగా వస్తే అనుమతి లేదు

పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించేది లేదని, ఈ నిబంధనను పక్కాగా అమలు చేస్తామని ఆర్ఐఓ స్పష్టం చేశారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు, సీనియర్ విద్యార్థులు మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తను నియమించడంతోపాటు మట్టికుండల్లో తాగు నీరు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రంలో విధుల్లో ఉండే సిబ్బందితో సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్ ఉండటానికి వీల్లేదన్నారు. విధులకు హాజరయ్యే సిబ్బంది ఐడీ కార్డు ధరించాలని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఆటంకం కలిగించాలని యత్నించినా, అక్రమాలకు పాల్పడేందుకు కుట్రపన్నినా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

జీఆర్‌పీ సీఐగా శ్రీకాంత్‌బాబు బాధ్యతల స్వీకరణ



సీఐ శ్రీకాంత్‌బాబు

ఒంగోలు: రైల్వే పోలీసుస్టేషన్ సీఐగా ఎస్.శ్రీకాంత్‌బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాంత్‌బాబు గతంలో ఒంగోలు ట్రాఫిక్ విభాగం, టూటౌన్ పోలీసుస్టేషన్లో ఎస్సైగా పనిచేశారు. సీఐగా పదోన్నతి పొందిన అనంతరం గుంటూరు జిల్లా తుళ్లూరు, ప్రకాశం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ -2 ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఒంగోలు ప్రభుత్వ రైల్వే పోలీసు అధికారులతో పాటు చీరాల ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్ అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా రైళ్లల్లో, రైల్వేస్టేషన్ల ఆవరణలో నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వేసవిలో దొంగతనాలు జరగకుండా రైళ్లల్లో ప్రయాణికులను చైతన్యం చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.